సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం । 21 । జనవరి । 2023



ఏసీబీ ట్రాప్

ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. మేడారంలో రంగులు వేసిన కాంట్రాక్టర్ వద్ద నుంచి లంచం డిమాండ్ చేయడంతో ఆయన ఏసీబీని ఆశ్రయించారు. - 8లో▸



నేటి నుంచి రీ ఓపెన్ అయ్యేనా?

కేయూలో విద్యార్థులకిచ్చిన 11 రోజుల సెలవులు శుక్రవారంతో ముగిశాయి. అయితే కామన్ మెస్, పలు హాస్టళ్లలో మరమ్మతులు కొనసాగుతున్నాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
31.6^0 / 18.7^0

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉదయం పూట మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ వేడి అధికంగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని మైనార్టీ పాఠశాల, జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు గాను ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి బుర్ర సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ పాఠశాలలో 5వ తరగతిలో మొత్తం సీట్లకు, 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లకు, అదేవిధంగా ఇంటర్మీడియట్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సులోని మొదటి సంవత్సరం సీట్లకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు (7207998957), పాఠశాల ప్రవేశాలకు ప్రిన్సిపాల్ రజిత (7995057911) నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కార్మిక సమస్యలపై స్పష్టత ఇవ్వాలి

భూపాలపల్లి అర్బన్: గత గుర్తింపు సంఘం ఎన్నికల్లో సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు, కార్మికుల సమస్యల పరిష్కారంపై తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత స్పష్టత ఇవ్వాలని సీఐటీయూ బ్రాంచీ కార్యదర్శి కంపేటి రాజయ్య డిమాండ్ చేశారు. ఏరియాలోని కేటీకే 8వ గనిలో శుక్రవారం సీఐటీయూ నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ నెల 22వ తేదీన భూపాలపల్లిలో టీబీజీకేఎస్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి వస్తున్న కల్వకుంట్ల కవిత కార్మికుల సమస్యల గురించి మాట్లాడాలని కోరారు. మారుపేర్ల సవరింపు, డిపెండెంట్ కార్మికుల వయస్సు 40 సంవత్సరాలకు పెంపుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఇటీవల సీఎం కేసీఆర్ నిర్వహించిన పెద్దపల్లి, ఖమ్మం బహిరంగ సభలలో సింగరేణి కార్మికుల సమస్యలపై ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, ప్రభాకర్, నర్సింహా, రాజేందర్, నారాయణలు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన




చిట్యాల: మండలంలోని ఒడితల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, ఆస్పత్రిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ మౌనిక, సిబ్బంది ఉన్నారు.

అధిక దిగుబడి సాధించాలి



మొగుళ్లపల్లి: సరైన మోతాదులో రసాయనాలు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని స్పైసిస్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ విజిష్ట అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో మిరప, పసుపు పంటలో అధిక దిగుబడులు సాధించడానికి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరపలో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం వల్ల చీడపీడల ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. పసుపులో విత్తన ఎంపిక నిల్వ, విత్తన శుద్ధి అరబెట్టడం పాలిషింగ్ ప్రమాణాలుగా పరిగణించబడుతాయన్నారు. అనంతరం రైతుల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతకు సంబంధించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యనిర్వహక అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, సర్పంచ్ మోటె ధర్మారావు, మండల వ్యవసాయాధికారి సురేందర్‌రెడ్డి, ఏఈఓలు నాగరాజు, జ్యోత్స్న, యోగిత, శ్రీకాంత్, ప్రవళిక, రైతులు పున్నం చందర్‌రావు, గుండారపు తిరుపతి, జగ్గారావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యాగశాలలో చండీహోమం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో యాగశాలలో మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక హోమం పూజలను నిర్వహించారు. శుక్రవారం యాగశాలలో వేదపండితులు మంత్రోచ్ఛారణ మధ్య లక్ష్మీగణపతి పూజ, నవగ్రహ, పంచసూక్తా, రుద్ర చండీ హోమాది పూజలను నిర్వహించారు. అనంతరం శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో అభిషేక పూజలు చేశారు. దీంతో ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది.

పత్తి ధర ఢమాల్

రోజురోజుకూ తగ్గుతున్న తెల్లబంగారం ధరలు

- పెరిగిన పెట్టుబడి, తగ్గిన దిగుబడి
- పరేషాన్ అవుతున్న రైతులు
- ఇళ్లలోనే నిల్వ ఉంచిన వైనం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు భూపాలపల్లి మండలం నాగారం గ్రామానికి చెందిన బాషబోయిన గంగులు యాదవ్. ఈ ఏడాది తనకున్న 10 ఎకరాల్లో పత్తిపంట సాగు చేశాడు. మొదటిసారి మొలకెత్తిన తర్వాత ఎడతెరిపి లేకుండా కురిసిన వానలకు పత్తి కొట్టుకుపోయింది. రూ.3 లక్షలు పెట్టుబడి నష్టపోయాడు. అయినా మళ్లీ అప్పు తీసుకువచ్చి పత్తి వేశాడు. ఆలస్యం అవడమో.. ఏమో తెలియదు కాని పత్తి దిగుబడి తగ్గింది. గతంలో ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఈ ఏడాది 7 నుంచి 8 క్వింటాళ్లు రావడమే కష్టంగా ఉంది. దీనికి తోడు మార్కెట్‌లో పత్తి ధర రోజురోజుకూ పడిపోతోంది. ధర పెరిగినప్పుడే అమ్ముతామనుకుని ఇంటిలోనే నిల్వచేశాడు.

భూపాలపల్లి రూరల్: పత్తి ధరలు రోజురోజుకూ పడి పోతుండటం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. గత నెల రోజుల క్రితం మురిపించిన ధరలు.. పత్తి చేతికందిన తర్వాత తగ్గుముఖం పట్టడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. జిల్లాలో ఈ ఏడాది 95,638 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. నవంబర్ మాసంలో పత్తి క్వింటాల్‌కు రూ.9,400 ధర పలికింది. దీంతో రైతులు ఆశలు పెంచుకున్నారు. అమ్ముదామనుకునే లోపే ధర సుమారుగా రూ. 2 వేలు తగ్గి రూ.7,200 వేల వరకు పలుకుతుంది. ధరలు పెరుగుతాయన్న ఆశలతో రైతులు పత్తిని ఇళ్లలోనే నిలవ్వగా ఉంచుకుంటున్నారు.

ఎకరాకు రూ.30వేలు..

పత్తి పంట సాగు చేసి దిగుబడి వచ్చే వరకు ఎకరానికి రూ.30 వేల పెట్టుబడి పెట్టాల్సిందే. కౌలు తీసుకున్న రైతులకు ఎకరానికి అదనంగా మరో రూ. 20 వేలు కలిపి రూ. 50 వేల పెట్టుబడి అవుతుంది. అధిక వర్షాలు, వరదల కారణంగా దిగుబడి సగానికి తగ్గింది. ఎకరానికి 12 నుంచి 15 క్వింటాళ్లు రావాల్సి ఉండగా, 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి కడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. దిగుబడి తగ్గిన పత్తి ధర బాగుంటే పెట్టుబడి అయినా చేతికచ్చేదని రైతులు అంటున్నారు.



మల్లంపల్లిలో పత్తి చేను

అప్పు తెచ్చి పెట్టుబడి



నాగారంలో ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి

రోజురోజుకు పత్తి ధరలు తగ్గుతుండటంతో పత్తిని మార్కెట్‌కు తరలించేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. ఈసారి దిగుబడి తగ్గడంతో రానున్న రోజుల్లో పత్తి ధర పెరుగుతుందనే ఆశతోనే చాలా మంది రైతులు సేకరించిన పత్తిని ఇళ్లకు తరలించి నిల్వ చేస్తున్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇంట్లోనే ఉంది..



రెండెకరాల్లో పత్తి సాగు చేశాం. వరంగల్ మార్కెట్‌లో పత్తి ధర తగ్గిందంటున్నారు. దీంతో ఇప్పటికే కొంత పత్తిని ఇంట్లోనే నిల్వ చేశాం. చేనుపై చాలా పత్తి ఉంది. పత్తిని తీయాలనే ఆసక్తి లేదు. కూలీలకు డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదు. నేను మా కుటుంబ సభ్యులందరూ వీలున్న సమయంలో పత్తి తీసి ఇంట్లో నిల్వ చేస్తున్నాం. ప్రభుత్వం గతేడాదిలాగా పత్తికి ధర పెంచి కొనుగోలు చేయాలి.

– ఆకుదారి రజిత, మల్లంపల్లి, మల్హర్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

గణపురం: స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గణపురం మండలంలోని పలు జీపీల్లో శుక్రవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. అభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల ప్రజలు కేసీఆర్ పాలన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు రూ.10 లక్షల దళితబంధు, తదితర పథకాలను అమలు చేస్తూ దేశంలో రాష్ట్రం వైపు చూసేలా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అయిలోని శశిరేఖరాం చంద్రా రెడ్డి, రామంచ భద్రయ్య, కాల్య రజిత బాబు, ఎంపీటీసీలు మంద అశోక్ రెడ్డి, మోటపోతుల శివశంకర్ గౌడ్, గణపురం పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచంద్రా రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోలసాని లక్ష్మీనరసింహారావు, నాయకులు మోతె కర్ణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారిపై విచారణ?

- కలెక్టర్‌కు ఇంటెలిజెన్స్ పోలీసుల రిపోర్టు
- త్వరలో వేటుకు రంగం సిద్ధం?

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న ఓ అధికారి అవినీతికి పాల్పడినట్లు ఇంటెలిజెన్స్ పోలీసులు కలెక్టర్‌కు రిపోర్ట్ సమర్పించినట్లు సమాచారం. మండలంలోని కాళేశ్వరంలో నవంబర్ నెలలో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఆటోను కాళేశ్వరం ముక్తివనం పార్కు వద్ద పోలీసులు పట్టుకున్నారు. 16 సంచులతో కూడిన 8 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నట్లు కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌ను ఎస్సై నమోదు చేశారు. రెండు రోజుల తర్వాత రెవెన్యూ అధికారి వచ్చి ఆటోలో 6 సంచులతో 3 క్వింటాళ్ల బియ్యం మాత్రమే ఉన్నట్లు పంచనామా చేసి దగ్గరలోని రేషన్ డీలర్ దుకాణానికి తరలించినట్లు తెలిసింది. ఆటోకు తక్కువ జరిమానా వేయాలనే ఉద్దేశ్యంతో 8 క్వింటాళ్లకు బదులు 3 క్వింటాళ్లుగా పంచనామా ఇచ్చినట్లు ఇంటెలిజెన్స్ పోలీసులు కలెక్టర్‌కు సమర్పించారు. ప్రస్తుతం ఆ అధికారిపై రెవెన్యూశాఖ అధికారులు అంతర్గతంగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఇదే కాకుండా సదరు అధికారిపై మండలం వ్యాప్తంగా పలు ఆరోపణలు వెల్లువెత్తుతుండడంతో త్వరలో వేటుకు రంగం సిద్ధం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయమై తహసీల్దార్ శంకర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా 'నాకు ఎలాంటి విషయం తెలియదు, ఇటీవలనే బదిలీపై వచ్చా'నని తెలిపారు.

రూ.1.15 లక్షల ఆదాయం

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవస్థాన ఆదాయం రూ.1.15లక్షలు వచ్చినట్లు ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్ తెలిపారు. ఆలయ ఆవరణలో శుక్రవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవాదాయశాఖ పరిశీలకులు డి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం కుమార్‌రెడ్డి, ఆలయ పూజారులు రాధాకృష్ణమాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి

వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి: జిల్లాలో ఓటరు జాబితాలో ఉన్న ఫొటో సిమిలర్ ఎంట్రీస్ (పీ.ఎస్.ఈ) త్వరగా ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవికిరణ్‌తో కలిసి కలెక్టర్‌లతో జాతీయ ఓటరు దినోత్సవం, పీ.ఎస్.ఈ ఎంట్రీ ధ్రువీకరణ, ఓటరు ఎపిక్ కార్డుల జారీ, ఓటర్ ఐడీతో ఆధార్ అనుసంధానం ప్రక్రియపై వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలో పీ.ఎస్.ఈ ఎంట్రీ పరిష్కారం కోసం వందశాతం ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆధార్ లింక్ పూర్తి చేస్తామని, నూతన ఓటరు కార్డు పంపిణీ పోస్టల్ ద్వారా పూర్తి చేస్తామని, ఓటరు దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల సిబ్బంది అబ్బాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ హక్కు చట్టాన్ని పొడిగించాలి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పూల్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న పూల్‌సింగ్

కాటారం: అటవీ హక్కు చట్టాన్ని 2006 నుంచి 2015 వరకు పొడిగించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆజ్మీర పూల్‌సింగ్ ప్రభుత్వాన్ని కోరారు. కాటారం మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీలతో పాటు ఎస్సీ, బీసీలకు సైతం పోడు భూమి హక్కు పత్రాలు అందజేయాలన్నారు. బీసీలకు 52శాతం, ఎస్సీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు ధరణిని రద్దు చేయడం, అసైన్డ్ భూములను పట్టాలుగా మార్చాలని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా ఐదు మండలాల్లో సాగు నీరు అందించాలనే డిమాండ్లతో ఈ నెల 25న కాటారం మండల కేంద్రంలో అన్ని కుల సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు బచ్చల ఎర్రయ్య, మాలభేరి రాష్ట్ర కన్వీనర్ పీక కిరణ్, నారమళ్ల సారయ్య, దళిత, గిరిజన నాయకులు గుంటి రామయ్య, గజ్జల రాజయ్య, సంపత్, అక్కల బాపుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల బతుకులు మారేదెప్పుడు?



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు నాయక్

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వాలు మారినా.. గిరిజనుల బుతుకులు మారడం లేదని సేవాలాల్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబు నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సేవాలాల్ సేనా జిల్లా కన్వీనర్ భూక్యా సురేష్‌నాయక్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబునాయక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో గిరిజనుల బతుకుల్లో మార్పు లేదన్నారు. పోడు భూముల సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభించలేదన్నారు. ప్రతి గిరిజన రైతుకూలీలకు పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, కార్పొరేషన్‌లను వేరు చేసి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలన్నారు. ట్రైబల్ ప్రాంతాల్లో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదస్సులో గిరిజనులు కానిస్టేబుల్ రాజారాం పాడిన పాటలు అలరించాయి. ఈ సదస్సులో సేవాలాల్ సేనా రాష్ట్ర నాయకులు ప్రేమ్‌చంద్, హుస్సేన్, వాంకుడోతు జ్యోతి, మోహన్ నాయక్, వాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంతులతో ప్రధాన ద్వారం



షఫింగ్ పనులు చేస్తున్న సిబ్బంది



చకచకా..

చురుకుగా కొనసాగుతున్న మేడారం మినీజాతర పనులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క సారలమ్మ మినీ జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం పనులు చురుకుగా సాగేందుకు అధికార యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు జరిగే మినీ మేడారం జాతర (మండమెలిగె) పండుగ జరుగనుంది. ఈ జాతరకు ఇంకా పది రోజులే సమయం ఉంది. జాతర ఏర్పాట్లపై ఐటీడీఏ పీఓ అంకిత్ పలుమార్లు అధికారులతో సమీక్షలు చేపట్టి పనులు వేగంగా జరిగే విధంగా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే శుక్రవారం మేడారంలో పలు శాఖల అధికారులు ఆయా పనులను పరిశీలించి పురోగతిని పీఓకు వివరించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ముందస్తుగా ఐటీడీఏ ద్వారా పనుల పూర్తిపై యూనిట్ అధికారులను కేటాయించి వేగంగా పనులు పూర్తి చేసేలా అధికారులు నిమగ్నమయ్యారు. వన దేవతలను దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తుండడంతో తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ పాయింట్లపై దృష్టిసారించారు. అలాగే గద్దెల ప్రాంగణంతో పాటు క్యూలైన్ల లో కూడా పందిర్లు నిర్మించారు. విద్యుత్ దీపాలను కూడా అలంకరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో బోర్లను షఫింగ్ చేపట్టారు. తాగునీటి కోసం నల్లాలు, చేతి పంపులను సిద్ధం చేస్తున్నారు. ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత, డీఈఈ నవీన్, ఏఈఈ అబీద్‌ఖాన్‌లు మేడారంలో పర్యటించారు. చేపడుతున్న పనులను తనిఖీ చేశారు. అలాగే బయ్యక్కపేటలో కలరింగ్, విద్యుత్ పనులను ఈఈ పరిశీలించారు.

గద్దెల ప్రాంగణంలో విద్యుత్ వెలుగులు

మేడారం సమ్మక్క– సారలమ్మ గద్దెల ప్రాంగణం హైమాస్ట్ దీపాలతో కాంతులీనుతున్నాయి. ఫిబ్రవరిలో జరిగే మినీ మేడారం జాతర సందర్భంగా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో సమ్మక్క– సారలమ్మ గద్దెల ప్రాంగణం, సాలహారం చుట్టూ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు.



మేడారం గద్దెలు, క్యూలైన్ల వద్ద నిర్మించిన చలువ పందిర్లు



బయ్యక్కపేటలో కలరింగ్ పనులు పరిశీలిస్తున్న ఈఈ హేమలత

- వివరాలు 10లో▸

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న డీఏఓ విజయ్‌భాస్కర్

చిట్యాల: మండలంలోని జూకల్, నైన్‌పాక రైతు వేదికలో ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి సునీల్ కుమార్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుకు ఉద్యాన శాఖ అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేపట్టడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి నికర ఆదాయం పెరుగుతుందన్నారు. మిగతా అన్ని రకాల పంటలతో పోలిస్తే పామాయిల్ పంట రైతులకు అనేక ప్రయోజనాలను చేకూర్చుతుందన్నారు. సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ఆయిల్ పంప్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గంద్ర గౌతంరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో పెరిగిన భూగర్భ జలాలకు అనుగుణంగా పంట సాగు చేయాలన్నారు. అలాగే ఆయిల్ పామ్ కంపెనీ తరపున అన్ని రకాల అవసరాలను రైతులకు ఎప్పటికప్పుడు అందించడం జరుగుతుందన్నారు.

వందేభారత్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాశిబుగ్గ: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం జరిగింది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40–45 ఏళ్ల మధ్య వయస్సు, 5.5 ఎత్తు, నీలం రంగు టీషర్టు, గ్రే కలర్‌పాయింట్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి హంటర్ రోడ్డు సంతోషిమాత గుడి ఎదురుగా ఉన్న రైలు ట్రాక్‌పై పట్టాలు దాటుతుండగా.. వందేభారత్ రైలు ఢీకొట్టింది. మృతుడి శరీరంలో స్టీల్ రాడ్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు, మృతుడి వివరాలు తెలిస్తే వరంగల్ జీఆర్పీ స్టేషన్ లేదా 94406 04320, 94406 27532 నంబర్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

● స్పెల్‌బీ విజేతలకు ప్రశంసపత్రాల అందజేత



'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి రీజినల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం రాంపూర్ యూనిట్ కార్యాలయంలో ప్రశంసపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వైద శ్రీనివాస్, ఎడిషన్ ఇన్‌చార్జ్ వర్దెల్లి లింగయ్య, ఈవెంట్స్ ఇన్‌చార్జ్ సుమన్, ఫొటో జర్నలిస్టు సంపెట వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SPL
SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన
ఫోన్ నంబర్లు : 95055 14424
గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

కామన్ మెస్ రీ ఓపెన్ అయ్యేనా?

- కేయూలో నేటితో ముగిసిన సెలవులు
- కొనసాగుతున్న మరమ్మతులు

కేయూ క్యాంపస్: కేయూలో పీజీ తదితర కోర్సుల విద్యార్థులకిచ్చిన 11 రోజుల సెలవులు శుక్రవారంతో ముగిశాయి. సంక్రాంతి సెలవుల పేరున హాస్టళ్లు, మెస్‌లలో మరమ్మతుల నేపథ్యంలో సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనెల 21 నుంచి రీ ఓపెన్ చేయాల్సి ఉండగా.. కామన్ మెస్‌లో, పలు హాస్టళ్లల్లో ఇంకా మరమ్మతులు కొనసాగుతున్నాయి. పలు విభాగాల్లో పెయింటింగ్ వేయిస్తున్నారు. కేయూ హాస్టళ్ల కమిటీ చైర్మన్ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్ లాల్, పాలక మండలి సభ్యులు పి.మల్లారెడ్డి, కేయూ అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య వాసుదేవరెడ్డి, యూజీసీ కో–ఆర్డినేటర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి సమావేశమై చర్చించారు. కామన్ మెస్‌ను సందర్శించి పరిశీలించారు. మరమ్మతుల నేపథ్యంలో పీజీ విద్యార్థులకు (బాయ్స్)కు అందులో కామన్ మెస్‌లో మెస్ సౌకర్యాన్ని ప్రారంభించే అవకాశం లేదని గుర్తించారు. మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉండడంతో ఆయా విద్యార్థులకు ప్రత్యామ్నాయంగా మరోచోట ఏర్పాటు చేయాలని చర్చించారు. అందుకు కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్‌లోని స్థలంలో మెస్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనేది కూడా చర్చించినట్లు సమాచారం. శుక్రవారం సాయంత్రం 7గంటల వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే మహిళా హాస్టల్‌లోనూ మరమ్మతులు కొనసాగుతున్నాయి. దీంతో రీఓపెన్ ఉంటుందా లేదా? అనేది కూడా యూనివర్సిటీ అధికారులు ప్రకటించలేదు. ఇక సెలవులు పొడిగించవద్దనే చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కానీ నిర్ణయాన్ని ప్రకటించడం లేదు. సెలవులు ముగిసినందున ఈనెల 21నుంచి తరగతులు యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది ఈనెల 21 నుంచి విద్యార్థులు అయితే క్యాంపస్‌కు చేరుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. సోమవారం వరకు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. సెలవులు పొడిగిస్తే విద్యార్థుల నుంచి వ్యతిరేకిత వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే 11 రోజులు సెలవులు ప్రకటించినప్పుడే తమకు మూడ్రోజులు సెలవులు చాలు 11 రోజులు వద్దని ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈనెల 21 నుంచి యథావిధిగా పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి స్పష్టం చేశారు.

మరమ్మతులంటూ విద్యార్థులను నిరాకరించిన సిబ్బంది

కాకతీయ యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగానికి చెందిన విద్యార్థులు(మహిళలు) సుమారు 12 మంది ఈనెల 21 నుంచి రీఓపెన్ ఉంటుందని భావించి శుక్రవారం సాయంత్రం యూనివర్సిటీకి వచ్చినట్లు సమాచారం. మహిళా హాస్టల్‌కు వెళ్లగా మరమ్మతులు జరుగుతున్నాయని లోనికి సంబంధిత సిబ్బంది నిరాకరించడంతో వారు ఆవేదనతో వెనుదిరిగినట్లు సమాచారం. మైక్రోబయాలజీ విభాగాధిపతి తప్పనిసరిగా ఈనెల 21న క్లాస్‌కు హాజరు కావాలని విద్యార్థులకు మెసేజీలు పంపినట్లు తెలుస్తోంది. అయితే మెస్‌లు రీఓపెన్ అవుతాయో లేదో అని కూడా విద్యార్థినులు అనుమానం వ్యక్తం చేసినప్పటికీ మీరు హాజరు కావాల్సిందేనని సమాచారం పంపినట్లు తెలుస్తోంది. దీంతో ఆయా విద్యార్థులు క్యాంపస్‌కు వచ్చినట్లు సమాచారం. సెలవులు ముగిసినందున ఈనెల 21 నుంచి మెస్‌లు రీ ఓపెన్ చేస్తారా? అని కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావును 'సాక్షి' శుక్రవారం సాయంత్రం వివరణ కోరగా.. తాము వివిధ హాస్టళ్ల మెస్‌లను సందర్శించి మరమ్మతులు ఎలా జరుగుతున్నాయో.. పరిశీలించామని తెలిపారు. మహిళా హాస్టల్ మెస్‌లకు ఎలాంటి ఇబ్బంది లేదని, తెరిచే అవకాశం ఉందని బాయ్స్ కామన్ మెస్‌లోనే మరమ్మతులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయం చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని శ్రీనివాస్‌రావు వివరణ ఇచ్చారు.

విద్యార్థి, ఉపాధ్యాయులకు కలెక్టర్ అభినందన



సాయిలేఖ్యను అభినందిస్తున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్ రూరల్: ప్రతిష్ఠాత్మక యంగ్ ఇన్నోవేటర్ ప్రోగ్రామ్ (వైఐపీ 2023) కార్యక్రమంలో పాల్గొన్న కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఈ.సాయిలేఖ్య, ఆమెను ప్రోత్సహించిన గైడ్ టీచర్ డాక్టర్ వి.గురునాథరావు, పాఠశాల హెచ్‌ఎం ఎస్.రమేశ్‌బాబును కలెక్టర్ కె.శశాంక శుక్రవారం అభినందించారు. మహబూబాబాద్ కలెక్టరేట్లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, జిల్లా విద్యా శాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి బుచ్చయ్య, జిల్లా విద్యా శాఖ ఏసీజీఈ మందుల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. కాగా.. వైఐపీని హైదరాబాద్‌లో జనవరి 3 నుంచి 13 వరకు సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) నిర్వహించగా.. రాష్ట్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి సాయిలేఖ్య ఎంపికైంది. పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు డాక్టర్ వి.గురునాథరావు ఆధ్వర్యంలో పాల్గొంది.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు **శ్రీ దండ రజనీకర్ రెడ్డి, తండ్రి: వెంకట్ రెడ్డి,** వయసు: 45 సం॥లు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఇంటి నెం. 2-4-508, రాంనగర్, హన్మకొండ జిల్లా, వాస్తవ్యులు గారు ఈ దిగువ షెడ్యూలు దాఖలు గల ఖాళీస్థలము ప్లాటు నెం. 50, సర్వే నెం. 593/బి యందు విస్తీర్ణం 200 చ.గజములు, భీమారం గ్రామము, హసన్‌పర్తి మండలం, హన్మకొండ జిల్లా యందు కలది. [illegible] నెం. 1575/2011, తేది: 24-03-2011 ద్వారా ఖరీదు చేసియుంటిరి, [illegible] లింక్ దస్తావేజు నెం. 2477/1988 కనిపించుట లేదు. [illegible]

షెడ్యూలు దాఖలు ఆస్తి హద్దులు: ప్లాటు నెం. 50, సర్వే నెం. 593/బి, విస్తీర్ణం 200 చ.గజములు, భీమారం గ్రామము, హసన్‌పర్తి మండలం, హన్మకొండ జిల్లా యందు గలదాని **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 59, **పడమర:** 30 ఫీట్ల రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం. 51, **దక్షిణం:** ప్లాట్ నెం. 49.

Sd/- CH. AGA REDDY, B.Sc., LL.B.
Advocate Notary
Opp: NPDCL Office, Nakkalagutta,
Hanamkonda. Cell: 9490380382

బాలిక కిడ్నాప్ కలకలం

- కిరాణానికి వెళ్లిన బాలిక.. ముఖానికి కర్చీఫ్ పెట్టి కిడ్నాప్
- తప్పించుకుని క్షేమంగా ఇంటికి..
- పీఎస్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదు.. కేసు నమోదు
- కిడ్నాప్ కాదంటున్న పోలీసులు



తల్లి కౌసర్‌బేగంతో కుమార్తె బుతుల్

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే గేట్ ప్రాంతం కాశికుంటలో శుక్రవారం ఉదయం బాలిక కిడ్నాప్ కలకలం రేపింది. పాల ప్యాకెట్ కోసం కిరాణానికి వెళ్లిన 12 ఏళ్ల బాలికను గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకుని మత్తుతో కూడిన కర్చీఫ్ ముఖానికి అడ్డుపెట్టి ఆటోలో కిడ్నాప్ చేశారు. కుమార్తె ఎంతకూ తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కాశికుంటకు చెందిన ఎండి ఇమ్రాన్, కౌసర్ బేగం దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇమ్రాన్ టింబర్ డిపోలో మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఇమ్రాన్ తల్లి గౌసియా బేగం, అతడి అక్క సాహెదాబేగం వీరు ఇరువురు జక్కలొద్దిలోని సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటైన తాత్కాలిక గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 7.30గంటలకు కౌసర్ బేగం తన కుమార్తె బుతుల్(12)ను పాలప్యాకెట్ తీసుకురమ్మని జన్మభూమి రోడ్డులోని కిరాణం షాపునకు పంపింది. షాపునకు వెళ్తున్న క్రమంలో ముగ్గురు ఆగంతకులు బాలిక ముఖానికి కర్చీఫ్ అడ్డు పెట్టి కిడ్నాప్ చేసి ఆటోలో తీసుకెళ్లారు. కిడ్నాపర్లు ఆటోను వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి మీదుగా వరంగల్ హంటర్ రోడ్డులోని గణపతి కాలేజీ జక్కలొద్ది క్రాస్ రోడ్డు వరకు తీసుకెళ్లారు. అక్కడ కిడ్నాపర్లు టీతాగేందుకు ఆటోను నిలపగా.. మత్తు నుంచి తేరుకున్న బాలిక ఆటో దిగి పరుగు పెట్టింది. అంతలోనే అటుగా వెళ్తున్న గుడిసెవాసులు బాలికను గుర్తు పట్టి ఆటోలో జక్కలొద్ది గుడిసెల్లో నివాసం ఉంటున్న నాన్నమ్మ, మేనత్త సాహెద బేగంకు బాలికను అప్పగించారు. అప్పటికే బాలిక తండ్రి ఇమ్రాన్ డయల్ 100 ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీనిపై తల్లిదండ్రులు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్ అప్రమత్తమై కిడ్నాప్ కేసు నమోదు చేసి పోలీసులను అప్రమత్తం చేశాడు. బాలిక మేనత్త సాహెద్ బేగం ఇమ్రాన్‌కు ఫోన్ చేసి చెప్పడంతో ఇమ్రాన్ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. కిడ్నాపర్ల కళ్లుగప్పి బాలిక తప్పించుకుని క్షేమంగా ఇంటికి చేరడంతో పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు!

బాలిక కిడ్నాప్ ఘటనలో పంజాబ్‌కు చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతడిని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఇదే విషయమై ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. బాలికను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, ఆకుటుంబానికి సన్నిహితంగా ఉండే ఓవ్యక్తి బంధువుల ఇంటి అడ్రస్ చూపించమని బాలికను ఆటోలో తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇదే విషయం బాలిక స్పష్టంగా చెప్పిందన్నారు. ఇమ్రాన్‌కు సరైన సమాచారం లేక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నీవెంటే నేను!

- మృత్యువులోనూ వీడని బంధం
- 24 గంటల వ్యవధిలో అన్నాదమ్ముళ్ల మృతి
- లెంకాలపల్లిలో విషాదం



రవీందర్, జలేందర్ (ఫైల్)

నల్లబెల్లి: పసిప్రాయంలో తండ్రిని కోల్పోయారు. ఆ లోటు తెలియకుండా తల్లి వారిని పెంచి పెద్ద చేసింది. బాల్యం నుంచి సోదరులు కలిసి పెరిగారు. ఇప్పుడు 24 గంటల వ్యవధిలోనే ఇద్దరూ మృత్యు ఒడికి చేరుకున్నారు. నీవెంటే నేను అంటూ ఇద్దరూ అనంత లోకాలకు వెళ్లిపోయారు. నల్లబెల్లి మండలం లెంకాలపల్లికి చెందిన రవీందర్ (40), జెలేందర్(37) 24 గంటల వ్యవధిలో మృతి చెందారు. బాల్యంలోనే వీరి తండ్రి వీరయ్య మృతి చెందాడు. కుమారుల్ని తల్లి రాజేశ్వరి కూలీ చేసి పెంచింది. కొంత కాలంగా పెద్ద కుమారుడు రవీందర్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పది రోజులుగా ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. కాగా.. అన్నను చూసి వచ్చేందుకు జెలేందర్ ఈనెల 18న వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు ఆస్పత్రి మెట్లపైనుంచి జారి పడి మృతి చెందాడు. ఈవిషయం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవీందర్‌కు తెలియకుండా కుటుంబ సభ్యులు జలేందర్ దహన సంస్కారాలు పూర్తి చేశారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న రవీందర్ సోదరుడి మృతిని తట్టుకోలేకపోయాడు. అది ఆరోగ్య పరిస్థితిపై ప్రభావం చూపడంతో వైద్యులు ఐసీయూకు తరలించి మెరుగైన వైద్యం అందించేందుకు యత్నిస్తుండగా మృతి చెందాడు. అన్నాతమ్ముళ్లు 24 గంటల వ్యవధిలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తమ కుటుంబాలను వదిలి వెళ్లారా అని కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు.

పలువురి పరామర్శ..

జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. రవీందర్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి, నాయకులు ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, పాలెపు రాజేశ్వర్‌రావు, మేకల లక్ష్మి, కక్కెర్ల శ్రీనివాస్, గన్నెబోయిన చేరాలు, కొత్తపల్లి అశోక్, కస్తూరి రవి, ఆకుల సాంబరావు ఉన్నారు.

బ్రేక్ బదులు ఎక్సలేటర్ తొక్కాడు!

- కారు పూజ కోసం వచ్చి బీభత్సం
- ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు ఇదే..

పర్వతగిరి: పర్వతగిరి మండలంలోని ప్రముఖ యాత్రా స్థలం అన్నారం షరీఫ్ దర్గా వద్ద శుక్రవారం కొత్త కారు బీభత్సం సృష్టించింది. ఖమ్మం జిల్లాకు చెందిన రఫీ ఇటీవల కొత్త కారు కొన్నాడు. కారుకు ఫాతెహా (ముస్లిం సంప్రదాయంలో పూజ) చేయించేందుకు షరీఫ్ దర్గాకు వచ్చాడు. దర్గా సమీపంలో కారు నడుపుతుండగా.. భక్తులను తప్పించేందుకు బ్రేక్ వేయబోయి ఎక్సలేటర్ తొక్కాడు. దీంతో కారు మరింత వేగంగా వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న బుచ్చన్న, నందిని, చింటు, దస్రు, మాలతిని ఢీకొట్టడంతో వీరికి గాయాలయ్యాయి. అందులో ములుగు జిల్లా గోస్‌పల్లి గ్రామానికి చెందిన నందినికి ముక్కులో నుంచి రక్తస్రావం కావడంతో నందినితో పాటు గాయాలపాలైన నలుగురిని మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎస్సై దేవేందర్, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని కారు యజమాని రఫీని అదుపులోకి తీసుకున్నారు. బ్రీతింగ్ టెస్ట్ చేయగా.. అతడు మద్యం తీసుకోలేదని తేలింది. కాగా.. అతడికి లైసెన్స్ ఉన్నట్లుగా ఎస్సై గుర్తించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. క్షతగాత్రులను వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు పరామర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాయమాటలు చెప్పి మైనర్‌తో వివాహం

- నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వరంగల్ రూరల్: ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి బలవంతంగా బాలికను పెళ్లి చేసుకుని అత్యాచారానికి పాల్పడిన వరంగల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధి బాలాజీనగర్‌కు చెందిన శీలపాక బన్నిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతడిపై కిడ్నాప్, అత్యాచారం, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏసీపీ వి.సతీశ్‌కుమార్ ఏనుమాముల సీఐ వి.చేరాలు, ఎస్.ఐ శ్రీకాంత్‌పోగుల తెలిపారు.

ఏసీబీ ట్రాప్

- లంచం తీసుకుంటూ పట్టుబడిన ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ సుదర్శన్



ఏసీబీకి చిక్కిన డీఈఈ నవీన్



ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో ఏసీబీ తనిఖీలు



అబీద్‌ఖాన్

ఏటూరునాగారం: ఏటూరు నాగారం ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్‌కు చెందిన ఇద్దరు అధికారులు శుక్రవారం ఏసీబీ వలలో చిక్కారు. 2022 మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో గద్దెలు, సాలహారానికి రంగులు(పెయింటింగ్) వేసిన కాంట్రాక్టర్ సంజీవ వద్ద నుంచి లంచం డిమాండ్ చేయడంతో ఆయన ఏసీబీని ఆశ్రయించాడు. ఐటీడీఏ నుంచి నాలుగు నెలల క్రితమే రావాల్సిన నిధులను ఇంజనీరింగ్ శాఖకు అధికారులు అలాట్ చేశారు. అయినా నాలుగు నెలల నుంచి పెయింటర్‌ను అధికారులు కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. విసిగిపోయిన కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో డీఈఈ నవీన్, ఏఈఈ అబీద్ ఖాన్ పెయింటర్ నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అబీద్ ఖాన్ డ్రాఫ్ట్‌మెన్ అయితే ఏఈఈగా పని చేస్తున్నారు. 15 ఏళ్ల నుంచి ఐటీడీఏలో ఏటూరునాగారం, తాడ్వాయి ప్రాంతాల్లో పని చేస్తున్నారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడారం సమ్మక్క సారలమ్మ 2022 జాతరకు గద్దెలు, ఇతర పెయింటింగ్ పనులను ములుగు గ్రామానికి చెందిన పెయింట్ కాంట్రాక్టర్ సంజీవ పనులు చేశాడు. రూ.16.50 లక్షల బిల్లు ఎంబీ రికార్డు చేసి సదరు కాంట్రాక్టర్‌కు డీఈఈ నవీన్, ఏఈఈ అబీద్‌ఖాన్‌లు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు రూ. 90 వేలు లంచం ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేశారు. దీంతో సంజీవ ఈనెల 10న ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. మొదటి దఫాగా రూ.50వేలు ఇస్తానని, మిగతావి తర్వాత ఇస్తానని సదరు ఇంజనీరింగ్ అధికారులతో సంజీవ ఒప్పుకున్నాడు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం ఐటీడీఏ కార్యాలయం వద్ద నవీన్, అబీద్‌ఖాన్ డబ్బులు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రూ. 50వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఏసీబీ డీఎస్పీ, ఏసీబీ సీఐలు శ్యామ్‌సుందర్, రవి, శ్రీనివాస్ ఉన్నారు.

సీసీ పుటేజీల సేకరణ

ఐటీడీఏ కార్యాలయంలోని సీసీ టీవీ పుటేజీలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంజనీరింగ్ అధికారుల కదలికలు, వారిని ఎవరెవరు కలిశారని ఆరా తీస్తున్నారు. గతంలో ఐటీడీఏలో జరిగిన గిరిజన దర్బార్‌లో కూడా తనకు మేడారం బిల్లులు రావాలని సంజీవ వినతి పత్రం అందించారు.

ఏసీబీ వలలో మొదటిసారి!

ఐటీడీఏ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా పనులు చేయాలంటే గుండెధైర్యంతోపాటు జేబులో డబ్బులుండాలి. బిల్లులు పొందాలంటే కాళ్లకున్న చెప్పులు అరగక తప్పదు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో అనేక బిల్లులను ఆపి కాంట్రాక్టర్లను పీడించి వారి నుంచి లంచాలు పెద్ద మొత్తంలో పొందడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. బిల్లులు సజావుగా రావాలంటే టీఏ, ఏఈఈ, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి పైవరకు చేతులు తడపక తప్పదని ఏసీబీకి చిక్కిన అధికారులను చూస్తే అర్థం అవుతోంది. ఐటీడీఏ కార్యాలయంలో ఏళ్ల తరబడి ఇక్కడే మకాం వేయడంతో ఏ కాంట్రాక్టర్ ఎలాంటి వారు... ఏ పనులకు ఎంత కమీషన్ పొందవచ్చనేది వారికి వెన్నతో పెట్టిన విద్యగా మారింది. ఐటీడీఏలో ఉన్న అధికారులను బదిలీ చేసి ప్రక్షాళన చేస్తే గిరిజనులకు అందాల్సిన ఫలాలు, పథకాలు అందవని చర్చ జరుగుతోంది. ఇంకా ఇలాంటి అవినీతి తిమింగలాలు చాలానే ఉన్నాయని సోషల్ మీడియాలో అనేక మంది కాంట్రాక్టర్లు, బాధితులు పోస్ట్ చేయడం కొసమెరుపు.